RNI NO: APTEL/26/A5325

మహిమ న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 74 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య. పేజీలు : 4 వెల రూ. 2 మంగళవారం -01 - సెప్టెంబర్ - 2026

Published From : Chittoor circulated by YSR Kadapa I Anatapuram I Kurnool I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

నేపాల్ విపత్తుకు కారణం ఇదే..

నేపాల్‌లో కుప్పకూలిన భారీ హిమానీనదం

డ్రోన్ వీడియోలో రికార్డైన ప్రళయ దృశ్యాలు

వరదల కారణంగా నేపాల్, టిబెట్‌లో వందల మంది మృతి

వేలాది మంది గల్లంతు, కొనసాగుతున్న సహాయక చర్యలు

హిమాలయాల్లో పెరుగుతున్న ప్రమాదాలకు ఇదో సంకేతమన్న నిపుణులు

2లో

నేపాల్‌లో వరద విలయం.. 900 దాటిన మృతుల సంఖ్య

2లో

వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు సామూహికంగా మృతదేహాల ఖననం

దాదాపు 4,200 మంది గల్లంతు.. వారిలో 592 మంది విదేశీయులు

జల విద్యుత్ ప్రాజెక్టు టన్నెళ్లలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు తీవ్ర యత్నాలు

ఆ ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున సాయం సీఎం చంద్రబాబు

- చిలకలూరిపేట రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం
- సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ మిగతా 2 లో

విశాఖకు ఏఐజీ.. రూ.2,000 కోట్లతో వెయ్యి పడకల హాస్పిటల్.. మంత్రి లోకేశ్ చేతుల మీదుగా శంకుస్థాపన

- విశాఖలో ఏఐజీ హాస్పిటల్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శంకుస్థాపన
- ఈ ప్రాజెక్టు ద్వారా 9 వేల మందికి ఉపాధి అవకాశాలు
- రెండు దశల్లో నిర్మాణం.. 2028 నాటికి తొలి దశ పూర్తి మిగతా 2 లో

నల్లమల గిరుల నుంచి పరుగులు పెట్టిన కృష్ణమ్మ

వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు..

- 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న మూడు జిల్లాల ప్రజల కల సాకారం
- పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- దోర్నాల వద్ద కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు, జలహారతి
- తొలి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు
- ప్రారంభోత్సవానికి భారీగా హాజరైన రైతులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు

అమరావతి: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల కల సాకారమైంది. పశ్చిమ ప్రకాశంలోని కరవు పీడిత ప్రాంతాలకు జీవనాడిగా భావిస్తున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా మిగతా 2 లో

నిర్మలా సీతారామన్ జీ20 పర్యటన

ఇరాన్, చైనా అంశాలపై దృష్టి

- అమెరికాలో జరుగుతున్న జీ20 సమావేశాల్లో పాల్గొంటున్న నిర్మలా సీతారామన్
- ఇరాన్ సంక్షోభం, ఇంధన భద్రతపై భారత్ ప్రధానంగా దృష్టి
- అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు, చైనా దిగుమతులపై ఆందోళన
- భారత్‌ను ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా ప్రమోట్ చేసే ప్రయత్నం

వెలిగొండతో వెలుగులు.. ఇది నినాదం కాదు, మా విధానం

30 ఏళ్ల కలను సీఎం చంద్రబాబు నిజం చేశారని ప్రశంస

- వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభంపై మార్కాపురం ప్రజలకు మంత్రి లోకేశ్ అభినందనలు
- కరవు, ఫ్లోరైడ్ సమస్యలకు ఈ ప్రాజెక్ట్‌తో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా
- ప్రాజెక్ట్ కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు ప్రత్యేక ధన్యవాదాలు



అమరావతి: దశాబ్దాల కల సాకారమవుతున్న చారిత్రక సందర్భంలో మార్కాపురం జిల్లా ప్రజలకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి మిగతా 2 లో

ప్రజాచైతన్యం పేరుతో మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలి

సెప్టెంబర్ 2 నుంచి కాంగ్రెస్ మోసాలపై నిరసనలు

- పార్టీ శ్రేణులకు మాజీమంత్రి హరీశ్ దిశానిర్దేశం
- కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల్లో చేసిన మోసాలను ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకుపోవాలి
- మళ్లీ కేసీఆర్ రావాలి అని ప్రజలు కోరుకుంటున్నారు

సిద్దిపేట: సిద్దిపేట గడ్డ నుంచి కాంగ్రెస్ వెయ్యి రోజుల మోసపాలనపై ప్రజాచైతన్యం పేరుతో మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం మిగతా 2 లో

1,000 రోజుల ప్రజాపాలనపై సర్కారు ప్రగతి నివేదిక

యువతకు ఉద్యోగాలు-నైపుణ్యాలకు కొత్త వేదిక

- సామాజిక న్యాయానికి పెద్దపీట
- రైతులు, మహిళలు, యువతకు భరోసా
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఆర్థిక ప్రగతి.. వ్యవసాయంలో నం.1
- ప్రభుత్వ బడులకు కొత్త రూపం

హైదరాబాద్: '2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి వలయాలతో హైదరాబాద్ నుంచి గ్రామీణ తెలంగాణ వరకు సమగ్ర అభివృద్ధి దిశగా మిగతా 2 లో

హుస్నాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

రూ. 15 కోట్లతో నిర్మించనున్న వసతి గృహ భవనాలకు మంత్రి శంకుస్థాపన

- ఏడాది క్రితం ప్రారంభించిన ఈ కళాశాలలో ప్రవేశాల సంఖ్య 175కు పెరిగింది
- మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులను తీసుకొస్తానన్నారు
- వచ్చే విద్యా సంవత్సరంలో కళాశాల హాస్టల్ భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తాం

హుస్నాబాద్ : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దన్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ సమీపం ఉమాపూర్‌లోని శాతవాహన ఇంజినీరింగ్ కళాశాలకు సంబంధించి మిగతా 2 లో

మోదీకి ఉజ్బెకిస్థాన్ పురస్కారం..

బాబర్‌ను గుర్తుచేసిన ఒవైసీ

ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం

మొఘల్ చక్రవర్తి బాబర్ పుట్టిన దేశమే ఇదని గుర్తుచేసిన ఒవైసీ

బాబర్‌ను విమర్శించే బీజేపీకి ఇదే నా అభినందనలంటూ వ్యంగ్యం

ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై ఒప్పందం

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహా న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

నల్లమల గిరుల నుంచి పరుగులు పెట్టిన కృష్ణమ్మ

అమరావతి: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల కల సాకారమైంది. పశ్చిమ ప్రకాశంలోని కరవు పీడిత ప్రాంతాలకు జీవనాడిగా భావిస్తున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద ప్రాజెక్టు సొరంగాల నుంచి ఉరకలేస్తూ వచ్చిన కృష్ణా జలాలకు ఆయన భక్తిశ్రద్ధలతో జలహారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ చారిత్రక ఘట్టంతో ఆ ప్రాంత రైతులు, ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఈ సందర్భంగా గంటవానిపల్లె ఫీడర్ కెనాల్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్వయంగా నీళ్లలోకి దిగి కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీర సమర్పించి హారతి ఇచ్చారు. అంతకుముందు, జలహారతి ప్రదేశానికి విచ్చేసిన ముఖ్యమంత్రికి గిరిజన మహిళలు తమ సంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పండితులు ముఖ్యమంత్రికి శ్రీశైలం మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని అందించి ఆశీర్వదించారు. నల్లమల కొండలను తొలుచుకుంటూ నిర్మించిన రెండు భారీ సొరంగాల నుంచి కృష్ణా జలాలు గంటవానిపల్లె ఆక్విడెక్టుకు చేరుకుని, అక్కడి నుంచి నల్లమల సాగర్ రిజర్వాయర్‌లోకి పరుగులు తీశాయి. ఈ దృశ్యాన్ని సభా ప్రాంగణం నుంచి వీక్షించిన మార్కాపురం రైతులు, మహిళలు పులకించిపోయారు. తమ ప్రాంతానికి కృష్ణమ్మ రావడంతో వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, సుమారు 4 లక్షల మందికి తాగునీరు అందనుంది. ఈ చారిత్రక కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, డీబీవీ స్వామి, అనగాని సత్యప్రసాద్, పార్థసారథి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దశాబ్దాల నిరీక్షణకు కూటమి ప్రభుత్వం తెరదించిందని, ఇచ్చిన మాట ప్రకారం వెలిగొండను పూర్తి చేసిందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేపాల్ విపత్తుకు కారణం ఇదే..

ఢిల్లీ: హిమాలయ పర్వతశ్రేణుల్లోని లాంగ్‌టాంగ్ లిరుంగ్ శిఖరం వద్ద ఓ భారీ హిమానీనదం, దాని కింద ఉన్న రాతి పొరలు సహా కుప్పకూలింది. ఈ ప్రళయానికి సంబంధించిన భయానక దృశ్యాలు డ్రోన్ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ ఘటన కారణంగానే గత వారం నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో భీకర వరదలు సంభవించి వందలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. చైనాకు చెందిన ఒక ఫోటోగ్రాఫర్ సుమారు 7,200 మీటర్ల ఎత్తు నుంచి ఈ విపత్తును తన డ్రోన్ కెమెరాలో చిత్రీకరించారు. భారీ మంచు ఫలకం, రాళ్లతో కూడిన పర్వత భాగం ఒక్కసారిగా విరిగిపడటం, ఆ తర్వాత పర్వతాల నుంచి దట్టమైన ధూళి మేఘాలు పైకి లేవడం ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. విరిగిపడిన భాగం సుమారు 1,200 మీటర్ల దిగువన ఉన్న లోయలో పడటంతో మంచు, రాళ్లు, బురదతో కూడిన ఉప్పెన సృష్టించింది. ఈ ప్రళయం కారణంగా ఆగస్టు 26న భోటేకోశి, త్రిశూలి నదులు ఉగ్రరూపం దాల్చి భారీ విధ్వంసం సృష్టించాయి. ఈ వరదల వల్ల నేపాల్, టిబెట్ ప్రాంతాల్లో వందలాది మంది మరణించగా, వేలాది మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో ఎక్కువ మంది నేపాల్‌కు చెందినవారే. ఈ విపత్తు "ఊహకందనిది, హృదయ విదారకమైనది" అని నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఆవేదన వ్యక్తం చేశారు. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల వల్ల నష్టాన్ని అంచనా వేయడం సవాలుగా మారిందని ఆయన తెలిపారు. శాటిలైట్ చిత్రాలు, భూకంప డేటాను విశ్లేషించిన శాస్త్రవేత్తలు... లాంగ్‌టాంగ్ లిరుంగ్ ఉత్తర భాగంలో భారీ స్థాయిలో మంచు, రాళ్లు విరిగిపడటమే వరదలకు కారణమని తేల్చారు. హిమానీనదం కూలినప్పుడు భూకంప లేఖినిపై 5.2 తీవ్రతతో ప్రకంపనలు నమోదయ్యాయని వెల్లడించారు. హిమాలయాల్లో ఇలాంటి విపత్తులు ఇటీవలి కాలంలో తరచుగా జరుగుతున్నాయని, ఎత్తైన ప్రదేశాల్లోని అస్థిరమైన మంచు, రాళ్ల వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారి కోసం అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

నేపాల్‌లో వరద విలయం.. 900 దాటిన మృతుల సంఖ్య

ఢిల్లీ: పొరుగు దేశం నేపాల్‌ను భారీ వరదలు అతలాకుతలం చేశాయి. ఈ జల ప్రళయంలో మృతుల సంఖ్య 900 దాటింది. ఈరోజు నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఆర్ఆర్ఎంఏ) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. ఇప్పటివరకు 903 మృతదేహాలను వెలికితీశారు. నదీ తీరాల్లో కొట్టుకొచ్చిన మృతదేహాలతో విపత్తు తీవ్రత స్పష్టమవుతోంది. ఈ విపత్తులో అత్యధికంగా దక్షిణ చిత్వాన్ జిల్లాలో 272 మృతదేహాలు లభ్యమయ్యాయి. పెద్ద సంఖ్యలో లభిస్తున్న మృతదేహాలను నిర్వహించడం అధికారులకు పెను సవాలుగా మారింది. వ్యాధులు ప్రబలకుండా నివారించేందుకు, కాళీ గండకి, త్రిశూలి నదుల సంగమ స్థలమైన దేవఘాట్‌లో చాలా మృతదేహాలను సామూహికంగా ఖననం చేశారు. భవిష్యత్తులో గుర్తింపు ప్రక్రియ కోసం, ఖననం చేయడానికి ముందు మృతదేహాల నుంచి డీఎన్ఏ నమూనాలను సేకరించినట్లు చిత్వాన్ జిల్లా యంత్రాంగం తెలిపింది. మరో 21 గుర్తుతెలియని మృతదేహాలను వివిధ ఆసుపత్రుల్లో ఉంచామని, బంధువులు వచ్చి గుర్తించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ వరద విపత్తులో సుమారు 4,247 మంది అచూకీ గల్లంతైందని ఎన్‌డీఆర్ఆర్ఎంఏ వెల్లడించింది. వీరిలో 592 మంది విదేశీయులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. భోటేకోశి, త్రిశూలి నదీ తీరాల్లోని జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న 933 మంది కార్మికుల ఆచూకీ కూడా తెలియరాలేదు. నేపాల్-చైనా సరిహద్దు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న నేపాల్ ఆర్మీ, పోలీసులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు కూడా గల్లంతైన వారిలో ఉన్నారు. సహాయక చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు 252 మంది విదేశీయులు సహా మొత్తం 10,451 మందిని సురక్షితంగా కాపాడారు. నేపాల్ ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా 3,344 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. జలవిద్యుత్ ప్రాజెక్టుల టన్నెళ్లలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు భారత, చైనా సాంకేతిక బృందాల సహాయం తీసుకుంటున్నారు. మొత్తం 20,819 మంది సైన్యం, పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ఈ విపత్తులో 267 మంది గాయపడగా, వారిలో 156 మంది చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు.

ఆ ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున సాయం సీఎం చంద్రబాబు

అమరావతి: పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అండగా నిలిచారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 27వ తేదీన చిలకలూరిపేట సమీపంలో ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుంది. విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఆటో నుజ్జునుజ్జయి, అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా చిలకలూరిపేట మండలం, వేలూరు గ్రామానికి చెందినవారని అధికారులు గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన ఎనిమిది మంది మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

నిర్మలా సీతారామన్ జీ20 పర్యటన
ఇరాన్, చైనా అంశాలపై దృష్టి

ఢిల్లీ: అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రం, ఆష్‌విల్‌లో నిర్వహిస్తున్న జీ20 దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల సమావేశంలో భారత్ పలు కీలక అంశాలను లేవనెత్తనుంది. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా విధిస్తున్న ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు, ఇంధన భద్రత వంటి అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఈ సమావేశాల్లో పాల్గొనే నిమిత్తం నిర్మలా సీతారామన్ నిన్న సౌత్ కరోలినాలోని గ్రీన్‌విల్-స్పార్టన్‌బర్గ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. అమెరికాలో భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా ఆమెకు సాదర స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు సాగే ఈ సదస్సుకు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ ఆతిథ్యమిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధి పునరుద్ధరణ, ఆర్థిక అసమతుల్యతలను తగ్గించడం, సరఫరా గొలుసులను బలోపేతం చేయడం వంటి అంశాలపై ఈ భేటీలో కూలంకషంగా చర్చించనున్నారు. అయితే, ఇరాన్ సంక్షోభం కారణంగా ఇంధన భద్రతకు వాటిల్లే ముప్పుపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముడి చమురు, సహజవాయువు ధరలు పెరిగితే, అది భారత దిగుమతి వ్యయాన్ని పెంచడమే కాకుండా.. ద్రవ్యోల్బణం, రూపాయి విలువపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తుందని భారత్ భావిస్తోంది. మరోవైపు, చౌకగా లభించే చైనా ఉత్పత్తుల వల్ల దేశీయ పరిశ్రమలకు కలుగుతున్న నష్టాన్ని ఎత్తిచూపుతూనే, ఏకపక్ష సుంకాల విధింపును భారత్ వ్యతిరేకించనుంది. అంతర్జాతీయ సంస్థలకు భారత్‌ను ఒక ఆకర్షణీయమైన ప్రత్యామ్నాయ ఉత్పాదక, పెట్టుబడుల కేంద్రంగా ప్రమోట్ చేసేందుకు నిర్మలా సీతారామన్ ఈ వేదికను వినియోగించుకోనున్నారు. డిసెంబర్‌లో మయామిలో జరగనున్న జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సమావేశానికి ఈ భేటీ ఒక సన్నాహక వేదికగా నిలవనుంది.

హుస్నాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

హుస్నాబాద్ : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దన్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ సమీపం ఉమాపూర్‌లోని శాతవాహన ఇంజినీరింగ్ కళాశాలకు సంబంధించి సుమారు రూ. 15 కోట్లతో నిర్మించనున్న వసతి గృహ భవనాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది క్రితం ప్రారంభించిన ఈ కళాశాలలో ప్రవేశాల సంఖ్య 175కు పెరిగిందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులను తీసుకొస్తానన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో కళాశాల హాస్టల్ భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. హుస్నాబాద్లో ఇంజినీరింగ్ కళాశాల మండలంలో ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనం నిర్మాణం జరుగుతోందని తెలిపారు. చిగురుమామిడి మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, సైదాపూర్ మండలంలో అదనంగా మరో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభించనున్నట్లు మంత్రి పొన్నం చెప్పారు. భీమదేవరపల్లి మండలంలో నవోదయ పాఠశాల ఎల్కతుర్తి మండలంలో త్రిపుల్ ఐటీ ట్రాంచ్ రాబోతున్నాయన్నారు. హుస్నాబాద్‌లో కబడ్డీ అకాడమీ, మరో స్టేడియాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని, రేపటి భవిష్యత్తులో మంచి ప్లేస్మెంట్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ సతీష్ కుమార్, ప్రిన్సిపల్ తిరుపతి రెడ్డి, పుర అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశాఖకు ఏఐజీ.. రూ.2,000 కోట్లతో వెయ్యి పడకల హాస్పిటల్..

అమరావతి: ఆంధ్రప్రదేశ్ వైద్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. అసియాలోనే ప్రసిద్ధి గాంచిన ఏఐజీ (ఏఐజీ) హాస్పిటల్స్ ఇప్పుడు విశాఖపట్నంలో కొలువుదీరనుంది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ మెగా హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. విశాఖ అనందపురం మండలం ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డితో కలిసి మంత్రి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

రూ.2,000 కోట్ల పెట్టుబడి, 9,000 ఉద్యోగాలు

విశాఖలో నెలకొల్పనున్న ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కోసం ఏఐజీ యాజమాన్యం ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. నిర్మాణం పూర్తయితే వెయ్యి పడకల సామర్థ్యంతో ఇది ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద వైద్య కేంద్రాల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇది ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడగలదని అంచనా వేస్తున్నారు.

రెండు దశల్లో నిర్మాణం.. ప్రపంచ స్థాయి సేవలు

హాస్పిటల్ నిర్మాణాన్ని రెండు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశలో 650 పడకల సామర్థ్యంతో 2028 అక్టోబర్ నాటికి సేవలు ప్రారంభించాలని భావిస్తున్నారు. మిగిలిన 350 పడకలతో రెండో దశను ఆ తర్వాత రెండేళ్లలో పూర్తి చేస్తారు. మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో హాస్పిటల్ క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, 50కి పైగా వైద్య విభాగాలతో ప్రపంచ స్థాయి సేవలు అందించనున్నారు. కేవలం వైద్య సేవలే కాకుండా ఒకేచోట శిక్షణ, పరిశోధన, రోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సదుపాయాలతో ఒక సంపూర్ణ హెల్త్ కేర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయనున్నారు.

ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం

శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం భూమి పూజ నిర్వహించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆసుపత్రి నిర్మాణ ప్రణాళికలు, భవిష్యత్ సేవలకు సంబంధించి రూపొందించిన ప్రత్యేక ఆడియో విజువల్ (ఏవీ)ను మంత్రి వీక్షించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గణబాబు, ఏఐజీ వైస్ చైర్మన్ పీవీఎస్ రాజు, డైరెక్టర్ జీవీ రావు, సీఈవో సామ్ రిజ్వీ, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చీ సహా పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

1,000 రోజుల ప్రజాపాలనపై సర్కారు ప్రగతి నివేదిక

హైదరాబాద్: '2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి వలయాలతో హైదరాబాద్ నుంచి గ్రామీణ తెలంగాణ వరకు సమగ్ర అభివృద్ధి దిశగా కార్యాచరణను అమలుచేస్తున్నాం' అని నివేదికలో స్పష్టంచేసింది. అంశాలవారీగా ప్రగతిని ప్రస్తావించింది. "1,000 రోజుల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యమిచ్చాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మించడం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడం, రైతులు-మహిళలు-యువతకు భరోసా కల్పించడం, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడం, భవిష్యత్తు తెలంగాణకు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడంలో.. కొత్త అధ్యాయాన్ని నమోదు చేశాం" అని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో.. ప్రజా ప్రభుత్వం సెప్టెంబరు 1కి 1,000 రోజుల మైలురాయిని చేరుకుంటున్న నేపథ్యంలో.. 'ప్రగతి నివేదిక'ను ఆదివారం విడుదల చేసింది.

మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత ప్రయాణాలతో మహిళలకు దాదాపు రూ.11 వేల కోట్ల ప్రయాణ వ్యయం అదా అయింది. గృహజ్యోతి కింద 53 లక్షలకుపైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, 4.54 లక్షల మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.60,487 కోట్ల రుణాలు, రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ అందించాం. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులిచ్చాం. నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నాం. కొత్తగా 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చాం. తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం.అర్హులకు ఇంటినిర్మాణానికి రూ.5 లక్షల సహాయం ఇస్తున్నాం.

రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించి కులాల వారీ సామాజిక స్థితిగతులు వెల్లడించాం. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం 59 ఎస్సీ ఉపకులాలను 3గ్రూపులుగా వర్గీకరించి, ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ ఘనత వహించింది. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణతో కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం చేకూరింది. గిగ్ కార్మికుల కోసం ప్రత్యేక చట్టం తెచ్చాం.

2025-26లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరింది. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే దాదాపు 91 శాతం అధికం. సంక్షేమాన్ని కొనసాగిస్తూనే పెట్టుబడులు, ఉపాధి, మౌలిక సదుపాయాలు, సాంకేతిక రంగాల విస్తరణతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వచ్చింది. రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ చేసి 25 లక్షలకుపైగా రైతు కుటుంబాలకు ఊరటనిచ్చాం. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకుపైగా పెట్టుబడి సాయం అందించాం. రైతు సంక్షేమానికి రూ.1.68 లక్షల కోట్ల వ్యయం చేశాం. వరి సాగు, ఉత్పత్తిలో దేశంలో నంబర్-1గా నిలిచింది తెలంగాణ. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర న్యాయమైన వాటా కోసం రాజీలేని పోరాటం చేస్తున్నాం.

72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టాం. యువతలో నైపుణ్యం పెంపొందించే లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించాం. 65 ప్రభుత్వ ఐటీఐలు, 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. గోషామహల్‌లో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టాం. 2023 డిసెంబరు 7 నుంచి 2026 ఆగస్టు 12 వరకు ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా 5,18,186 మందికి రూ.2,526.12 కోట్ల సాయం అందించాం. సీఎంఆర్ఎఫ్ వైద్య రీయింబర్స్‌మెంట్ ద్వారా 4,78,789 మంది పేద రోగులకు రూ.1,635.34 కోట్లు.. 39,712 మందికి రూ.798.41 కోట్ల ఎల్ఓసీలు ఇచ్చి ఆదుకున్నాం. కేంద్రం ప్రకటించే పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి పురోగతి సాధించింది. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నాం. ఇప్పటికే 105 మంజూరుచేశాం. 22 లక్షలకుపైగా విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం ఇస్తున్నాం.

వెలిగొండతో వెలుగులు.. ఇది నినాదం కాదు,
మా విధానం: మంత్రి నారా లోకేశ్

అమరావతి: దశాబ్దాల కల సాకారమవుతున్న చారిత్రక సందర్భంలో మార్కాపురం జిల్లా ప్రజలకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నేడు వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుతో ఈ ప్రాంత దశ, దిశ మారబోతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "వలసల కష్టాలకు సెలవు చెబుతూ, అభివృద్ధికి స్వాగతం పలుకుతున్న మార్కాపురం జిల్లా ప్రజలకు వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ శుభాకాంక్షలు" అని తన సందేశాన్ని ప్రారంభించారు. దాదాపు 30 ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న కలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిజం చేస్తున్నారని కొనియాడారు. తీవ్ర కరవుతో అల్లాడుతున్న ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడంతో పాటు దశాబ్దాలుగా ప్రజలను పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ భూతం నుంచి విముక్తి కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని వివరించారు. "వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కేవలం సాగునీరే కాకుండా ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడతాం. తాగు, సాగు నీటి లభ్యతతో ఈ ప్రాంతంలో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించి రైతుల ఆదాయాన్ని పెంచుతాం" అని లోకేశ్ తెలిపారు. ఈ బృహత్తర ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించి, తమ భూములను, గ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో ప్రజా ప్రభుత్వం ఉక్కు సంకల్పంతో పనిచేస్తోందని లోకేశ్ స్పష్టం చేశారు. "ప్రజలకు మంచి చేయడం ద్వారా వారి అభిమానాన్ని పొందడమే మేం కోరుకునే అసలైన క్రెడిట్. 'వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు' అనేది కేవలం నినాదం కాదు, అది కూటమి ప్రభుత్వ విధానం" అంటూ ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. వెలిగొండ జలాలతో ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మోదీకి ఉజ్బెకిస్థాన్ పురస్కారం..
బాబర్‌ను గుర్తుచేసిన ఒవైసీ

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం లభించడంపై ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మొఘల్ సామ్రాజ్య స్థాపకుడు బాబర్ పుట్టిన దేశం నుంచి ప్రధానికి ఈ గౌరవం దక్కడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ బీజేపీ, సంఘ్ పరివార్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ పరిణామంపై బీజేపీకి శుభాకాంక్షలు తెలుపుతున్నానని, ఇది వారికి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయమని ఒవైసీ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. "భారత్‌కు బాబర్ ఏ దేశం నుంచి వచ్చాడో, అదే దేశం ఇప్పుడు మన ప్రధానమంత్రికి పురస్కారం ఇచ్చి గౌరవించింది. దీనికి బీజేపీకి నా అభినందనలు" అని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఉజ్బెకిస్థాన్‌లోని ఫెర్గానా లోయకు చెందినవాడే బాబర్ అని ఒవైసీ గుర్తుచేశారు. తరచూ తమ రాజకీయ విమర్శల్లో బాబర్ పేరును ప్రస్తావించే సంఘ్ పరివార్, ఆరెస్సెస్ మద్దతుదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. "మీరు బాబర్ పేరుతో ఎన్నో రకాలుగా దూషించారు, అవమానించారు. కానీ ఇప్పుడు అదే దేశ ప్రజలు మీకు అవార్డు ఇచ్చి గౌరవిస్తున్నారు. ఇకనైనా బాబర్ పేరుతో చేసే విమర్శలు ఆగిపోతాయని ఆశిస్తున్నా" అని ఒవైసీ పేర్కొన్నారు. రెండు రోజుల ప

ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత...! జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా

కడప, మహి న్యూస్ ఆగష్టు 31: ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత, ప్రజల సంతృప్తికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత సమయంలో తగిన పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని, వాస్తవ సమాచారంతోనే నివేదికలు అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖ కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రజలు సులభంగా తమ అభిప్రాయాన్ని నమోదు చేసేలా కనిపించే ప్రదేశాల్లో క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.పీజీఆర్ఎస్ సేవలు పొందిన వెంటనే ప్రజలు తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సేవలపై తమ అభిప్రాయాన్ని నమోదు చేయవచ్చని తెలిపారు. ప్రజలు అందించే ప్రతి స్పందన అధికారిక పీజీఆర్ఎస్ వ్యవస్థకు చేరి సేవల మెరుగుదలకు ఉపయోగపడుతుందని, ప్రజల సూచనలు ప్రభుత్వానికి విలువైనవన్నారు.అలాగే ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిగతులను టోల్ ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆమె ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, శివ రామిరెడ్డి, డీఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, ఎస్ఎస్ఏ ఏసీపీ అనురాధ, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి ఘన స్వాగతం

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి: జి. రామ గోపాల్

కడప, ఆగస్టు 31: మహి న్యూస్కడప జిల్లాకు నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన ప్రధాన జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి జి. రామ గోపాల్ను పలువురు అధికారులు, న్యాయశాఖ ప్రతినిధులు, మీడియా సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డీఆర్వో కె. మల్లికార్జునుడు, కడప జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్లు, రాజంపేట ఎంఆర్ఓ దస్తగిరి, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ టి. రాజశేఖర్ బాబు, ప్రత్యేక మహిళా జైలు సూపరింటెండెంట్ ఎ. కృష్ణవేణి, జైలర్ ఆర్. భువనేశ్వరి, జిల్లా పీఆర్వో రవి కుమార్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ప్రధాన జిల్లా న్యాయమూర్తిని కలిశారు.అనంతరం అధికారులు, న్యాయశాఖ ప్రతినిధులు నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి పుష్ప మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో న్యాయపరమైన అంశాలు, ప్రజలకు అందుతున్న న్యాయసేవలు తదితర అంశాలపై పరస్పరం చర్చించారు.పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ మంచి వేదికఈ సందర్భంగా ప్రధాన జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి జి. రామ గోపాల్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కేసులను సత్వరంగా, సౌహార్దపూర్వకంగా పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ ఒక మంచి వేదిక అని తెలిపారు.సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కేసుల పరిష్కారంలో పరస్పర అంగీకారం, సౌహార్దపూర్వక వాతావరణం ద్వారా ఇరుపక్షాలకు ప్రయోజనం కలిగేలా లోక్ అదాలత్‌లు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

పరిశ్రమల అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దు..!

జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమీక్ష సమావేశంలో డిఆర్వో మల్లికార్జునుడు

కడప, మహి న్యూస్ ఆగస్టు 31: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, అనుమతుల విషయంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకూడదని జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం డీఆర్వో మల్లికార్జునుడు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ చీఫ్ చిన్నారావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిఆర్వో మల్లికార్జునుడు మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తలకు అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమలకు మంజూరయ్యే అనుమతులపై సమావేశంలో సమీక్షించారు. జిల్లాలో మొత్తం 11,905 దరఖాస్తులు అందగా, 11,774 దరఖాస్తులకు అనుమతులు మంజూరైనట్లు అధికారులు వివరించారు. మరో 36 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో కాలుష్య నియంత్రణ మండలికి సంబంధించిన 20, కర్మాగారాల శాఖకు సంబంధించిన 16 దరఖాస్తులు ఉన్నట్లు తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను కూడా వేగంగా పరిష్కరించాలని సూచించారు.చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై కూడా సమావేశంలో చర్చించారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రవాణా వాహనాల కొనుగోలుకు సంబంధించిన మూలధన పెట్టుబడి రాయితీలు, సాధారణ పారిశ్రామికవేత్తలకు విద్యుత్ వ్యయాల రీయింబర్స్‌మెంట్, వడ్డీ రాయితీల మంజూరుపై ప్రతిపాదనలను పరిశీలించారు.జిల్లాలో ఇప్పటికే ఆమోదం పొందిన భారీ పరిశ్రమల పురోగతిపైనా సమావేశంలో సమీక్ష జరిగింది. కోప్పర్తిలో శ్రీ షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ సంస్థ రూ.4,914 కోట్ల పెట్టుబడితో 5,000 మందికి ఉపాధి కల్పించే ప్రాజెక్టు అమలు చేస్తోందన్నారు. జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్‌కు రూ.8,800 కోట్ల పెట్టుబడి, 800 ఉద్యోగాల లక్ష్యం కాగా దాల్మియా సిమెంట్ విస్తరణ ప్రాజెక్టు, శ్రీసిమెంట్ తదితర ప్రాజెక్టుల పురోగతిని కూడా సమీక్షించారు.జిల్లాలో పునరుత్పాదక ఇంధన రంగంలో అమలవుతున్న ప్రతిపాదిత ప్రాజెక్టులపై అధికారులు వివరాలు అందించారు. సౌర విద్యుత్ ప్రాజెక్టులు, పవన విద్యుత్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్ ప్రాజెక్టుల పురోగతిని సమావేశంలో సమీక్షించారు. జిల్లాలో ప్రతిపాదిత పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల సామర్థ్యం మొత్తం 15,150 మెగావాట్లుగా ఉన్నట్లు అజెండాలో పేర్కొన్నారు.ఏపీఐఐసీ పరిధిలో పారిశ్రామిక భూముల కేటాయింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 48 దరఖాస్తులపై సమావేశంలో చర్చించారు. కోప్పర్తి, కోప్పర్తి ఎంఎస్ఎంఈ పార్క్, మెగా ఇండస్ట్రియల్ హబ్, చౌడూరు ఎంఎస్ఎంఈ పార్క్ తదితర ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు.పారిశ్రామికవేత్తలకు అనుకూల వాతావరణం కల్పించడంతో పాటు, జిల్లాకు పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకురావడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని డీఆర్వో మల్లికార్జునుడు సూచించారు.ఈ సమావేశంలో ఎల్‌డీఎం జనార్దనం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అగ్నిమాపక శాఖ, డిటిఓ, వాణిజ్య పన్నుల శాఖ, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఐఐసీ, టూరిజం, బ్యాంకర్లు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సీఐ గదిలో ఏం జరిగింది? సీసీ కెమెరాలే చెప్పాలి!

"అమ్మను.. ఆడవారిని తిట్టడమే పోలీసింగ్‌నా?"

మహి న్యూస్ ఎడిటర్ గా ఫోన్ చేసిన అడిగితే "ప్రూఫ్ ఉందా?".. మరి సీఐ గదిలో జరిగిన మాటలకు సామాన్యుడు సాక్ష్యాలు ఎలా సేకరించాలి?

కొరియర్ పార్సల్ వివాదంలో పోలీస్ అధికారం దుర్వినియోగమైందా? ఉన్నతాధికారులకు

మహి న్యూస్ ఫిర్యాదుకడప జిల్లా/జమ్మలమడుగు, ఆగస్టు 31: మహి న్యూస్ :పోలీసులంటే ప్రజలకు భరోసా కల్పించాలి.. భయపెట్టకూడదు. పోలీస్ స్టేషన్ అంటే న్యాయం కోసం వెళ్లే ప్రదేశం కావాలి.. అవమానానికి గురయ్యే ప్రదేశం కాకూడదు. కానీ జమ్మలమడుగు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కొరియర్ పార్సల్ వివాదానికి సంబంధించి చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న పరిణామాలు ఇప్పుడు పలు ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.ఒక కొరియర్ పార్సల్‌లో విగ్రహం పగిలిపోయిందనే వివాదం పేరుతో బుకింగ్ పాయింట్‌కు చెందిన యువకుడిని కానిస్టేబుల్ ద్వారా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, గంటల తరబడి అక్కడ ఉంచి, దుర్భాషలాడి, కొన్ని పత్రాలపై సంతకాలు చేయించుకున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.ఈ వ్యవహారంపై ఉన్నత పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి నిజానిజాలు తేల్చాలని ఫిర్యాదుదారు కోరుతున్నారు.జమ్మలమడుగులో బుకింగ్.. బెంగళూరులో డెలివరీవివరాల ప్రకారం.. ఒక కస్టమర్ జమ్మలమడుగులోని ప్రొఫెషనల్ కొరియర్ బుకింగ్ పాయింట్‌కు పార్సల్ తీసుకొచ్చి తానే ప్యాక్ చేసి బెంగళూరుకు పంపించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.పార్సల్‌లో ఏ వస్తువు ఉంచారు? అది బుకింగ్ సమయంలో ఏ స్థితిలో ఉంది? వస్తువు ముందే పగిలి ఉందా? అనే విషయాలు బుకింగ్ పాయింట్‌లో పనిచేసే వ్యక్తికి తెలియవని ఫిర్యాదుదారు పేర్కొన్నారు.బెంగళూరుకు చేరిన తర్వాత పార్సల్‌ను రిసీవ్ చేసుకున్నారు. బయట ప్యాకింగ్ దెబ్బతిన్నట్లయితే సాధారణంగా పార్సల్‌ను రిజెక్ట్ చేయడం లేదా డ్యామేజ్ రిమార్క్ నమోదు చేయడం జరుగుతుంది. అయితే పార్సల్‌ను రిసీవ్ చేసిన తర్వాత తెరిచి చూడగా లోపల ఉన్న విగ్రహం పగిలిపోయిందని పేర్కొన్నట్లు ఫిర్యాదులో తెలిపారు.

రిసీవ్ చేసిన తర్వాత డ్యామేజ్ అయితే.. బాధ్యత ఎవరిది?

పార్సల్ బయటకు డ్యామేజ్ కనిపించినప్పుడు ఎందుకు రిసీవ్ చేశారు?రిసీవ్ చేసే సమయంలో డ్యామేజ్ రిమార్క్ ఉందా?డెలివరీ సమయంలో ఫొటోలు తీశారా?డెలివరీ రసీదుపై ఏమైనా అభ్యంతరం నమోదు చేశారా?రిసీవ్ చేసిన తర్వాత లోపల వస్తువు పగిలిపోయిందని గుర్తిస్తే.. ఆ నష్టం ఎక్కడ, ఎప్పుడు, ఎవరి వద్ద జరిగినదో నిర్ధారించకుండా జమ్మలమడుగు బుకింగ్ పాయింట్ వ్యక్తిపై బాధ్యత ఎలా మోపుతారు?ఇదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.పార్సల్ వివాదం.. పోలీస్ స్టేషన్‌కు యువకుడుపార్సల్ డెలివరీ అయిన మరుసటి రోజు సంబంధిత వ్యక్తులు జమ్మలమడుగు బుకింగ్ పాయింట్ వద్దకు వచ్చి వివాదాన్ని ప్రస్తావించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అనంతరం జమ్మలమడుగు అర్బన్ సీఐ అదేశాల మేరకు ఒక కానిస్టేబుల్‌ను పంపించి బుకింగ్ పాయింట్‌కు చెందిన యువకుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు ఆరోపించారు.

ఇక్కడే అసలు ప్రశ్నలు

మొదలవుతున్నాయి.అతనిపై కేసు ఉందా?

ఉందా?ఏదైనా పిటిషన్ నమోదు చేశారా?లిఖితపూర్వక నోటీసు ఇచ్చారా?ఏ కారణంతో అతన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు?కేవలం ఒక కొరియర్ వివాదం కారణంగా కానిస్టేబుల్‌ను పంపించి వ్యక్తిని స్టేషన్‌కు తీసుకురావాలని సీఐ ఆదేశించడానికి చట్టపరమైన ఆధారం ఏమిటి?ఈ ప్రశ్నలకు సమాధానాలు రావాల్సిందే.గంటల తరబడి స్టేషన్‌లో.. గదిలోకి పిలిచి దుర్భాషలా?బాధితుడి ఆరోపణ ప్రకారం.. అతన్ని పోలీస్ స్టేషన్‌లో సుమారు నాలుగైదు గంటల పాటు ఉంచారు.అంతేకాదు.. సీఐ గదిలోకి పిలిపించి, మొబైల్ ఫోన్‌ను బయటకు తీసుకుని/సెల్‌ఫోన్‌ను తీసుకున్న పరిస్థితిలో, అక్కడ నోటికి వచ్చినట్లు దుర్భాషలు మాట్లాడినట్లు బాధితుడు ఆరోపిస్తున్నారు.అమ్మను, అడవారిని ఉద్దేశించి కూడా అవమానకరమైన పదజాలం ఉపయోగించినట్లు ఆయన ఆరోపిస్తున్నారు.

ఇది నిజమైతే..

"పోలీసులంటే భయపెట్టడమా.. ప్రజలకు భరోసా ఇవ్వడమా?"పోలీస్ అధికారి ఒక పౌరుడితో మాట్లాడేటప్పుడు కనీస గౌరవం పాటించాల్సిన అవసరం లేదా?విచారణ పేరుతో వ్యక్తిగత అవమానాలు చేయడం పోలీసింగ్‌లో భాగమా?"ప్రూఫ్ ఉందా?".. సీఐకి మహి న్యూస్ ప్రశ్నఈ వ్యవహారంపై స్పష్టత కోసం మహి న్యూస్ తరఫున సీఐను సుమారు ఇరవై సార్లు ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫోన్‌కు స్పందించలేదని ఫిర్యాదుదారు పేర్కొన్నారు.తరువాత ఫోన్ ఎత్తిన సందర్భంలో, స్టేషన్‌లో దుర్భాషలు ఉపయోగించిన విషయంపై ప్రశ్నించగా.."ఏమైనా ప్రూఫ్ ఉందా? ఉంటే ఇవ్వండి" అనే విధంగా సమాధానం ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇక్కడే మరో కీలక ప్రశ్న:

సీఐ గదిలో జరిగిన సంభాషణకు సాక్ష్యాలు ఎవరి దగ్గర ఉండాలి?ఒక సాధారణ వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి.. అతని మొబైల్ తీసుకుని.. సీఐ గదిలోకి పంపించి.. అక్కడ ఏం మాట్లాడారో రికార్డు చేయకుండా ఉంటే.. తర్వాత "ప్రూఫ్ ఉందా?" అని అడగడం ఎంతవరకు సమంజసం?పోలీస్ స్టేషన్‌లో సీసీటీవీ కెమెరాలు ఉంటే.. ఆ సమయంలో జరిగిన వ్యవహారాన్ని ఉన్నతాధికారులు పరిశీలించవచ్చు కదా?"ప్రూఫ్ ఇవ్వండి" అంటున్నారా? అయితే సీసీటీవీ ఫుటేజీ బయటపెట్టండి!బాధితుడి వద్ద ఆడియో లేదా వీడియో ఉండకపోవచ్చు. కానీ పోలీస్ స్టేషన్‌లో సీసీటీవీ వ్యవస్థ ఉంటే, ఆ రోజు సంబంధిత సమయానికి సంబంధించిన ఫుటేజీనే అత్యంత ముఖ్యమైన ఆధారంగా పరిగణించవచ్చు.

అందువల్ల:

సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలి.స్టేషన్ డైరీని పరిశీలించాలి.బాధితుడు స్టేషన్‌లోకి వచ్చిన సమయం, వెళ్లిన సమయం నిర్ధారించాలి.ఎవరు అతన్ని తీసుకువచ్చారు?ఎవరు ఎక్కడికి తీసుకెళ్లారు?ఎంతసేపు సీఐ గదిలో ఉన్నారు?ఎవరెవరు అక్కడ ఉన్నారు?ఏ పత్రాలపై సంతకాలు తీసుకున్నారు?అన్నీ బయటకు రావాలి.చిన్నవారిపై ప్రతాపం.. పెద్దవారిపై ఎందుకు వెనకడుగు?పోలీసు శాఖ ప్రజలకు రక్షణ కల్పించే వ్యవస్థ. చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎంత పెద్దవారైనా, చిన్నవారైనా ఒకే విధంగా చట్టం ముందు నిలబడాలి.పెద్ద తప్పులు చేసిన వారిని ప్రశ్నించడానికి వెనుకడుగు.. సాధారణ కొరియర్ బుకింగ్ పాయింట్ యువకుడిపై మాత్రం పోలీసు ప్రతాపమా? అనే ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి.ఇది నిజమా? కాదా?విచారణ జరిపితే తేలుతుంది.అందుకే ఈ వ్యవహారంపై పారదర్శకమైన విచారణ జరగాల్సిన అవసరం ఉంది.బాధితుడికి క్షమాపణ చెప్పిస్తారా?పోలీస్ అధికారి దుర్భాషలు ఉపయోగించినట్లు విచారణలో తేలితే, అది కేవలం "తిట్టారు.. తిట్టలేదు" అనే విషయం కాదు.అది ఒక పౌరుడి గౌరవానికి సంబంధించిన విషయం.అందువల్ల ఆరోపణలు నిజమని తేలితే బాధితుడికి జరిగిన అవమానానికి బాధ్యత వహిస్తూ సంబంధిత అధికారి అధికారికంగా క్షమాపణ చెప్పేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు కోరుతున్నారు.ఉన్నతాధికారులు ఏం చేస్తారు?ఈ వ్యవహారంపై జమ్మలమడుగు అర్బన్ సీఐకు సంబంధం లేని ఉన్నతాధికారితో స్వతంత్ర, నిష్పక్షపాత విచారణ జరిపించాలని కోరారు.

అదేవిధంగా:

సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలి. స్టేషన్ డైరీ/జనరల్ డైరీ పరిశీలించాలి. ఫిర్యాదు/పిటిషన్/ వివరాలు బయటకు తీయాలి. వ్యక్తిని స్టేషన్‌కు తీసుకురావాలని ఇచ్చిన ఆదేశాలను పరిశీలించాలి. తీసుకెళ్లిన కానిస్టేబుల్ వాంగ్మూలం నమోదు చేయాలి. బాధితుడి వాంగ్మూలం నమోదు చేయాలి. సంతకాలు తీసుకున్న పత్రాలను పరిశీలించాలి. కొరియర్ పార్సల్ అసలు ఎక్కడ దెబ్బతిందో ప్రత్యేకంగా నిర్ధారించాలి. దుర్భాషల ఆరోపణలు నిజమైతే సంబంధిత అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలి. బాధితుడికి అధికారికంగా క్షమాపణ చెప్పేలా చర్యలు తీసుకోవాలి.

"పోలీసులకు అధికారం ఉంది.. కానీ ఆ అధికారం చట్టం కంటే పెద్దది కాదు!'

'ఒక పార్సల్ పగిలిందనే వివాదం నిజమైతే దానికి చట్టబద్ధమైన పరిష్కారం ఉంది. కానీ ఆ వివాదం పేరుతో ఒక సామాన్యుడిని అవమానించారనే ఆరోపణలు వస్తే, ఆ ఆరోపణలను కూడా అదే చట్టబద్ధమైన విధానంలో విచారించాల్సిందే."ప్రూఫ్ ఉందా?" అనే ప్రశ్నకు సమాధానం --- సీసీటీవీ ఫుటేజీని పరిశీలించండి. స్టేషన్ రికార్డులను బయటకు తీయండి. నిజం ఏదో తేల్చండి.ఇప్పుడు అందరి చూపు ఉన్నత పోలీసు అధికారుల తదుపరి చర్యలపైనే ఉంది.బాధితుడి ఆరోపణలు నిజమా?పోలీసు అధికార దుర్వినియోగం జరిగిందా?లేదా కొరియర్ వివాదాన్ని పోలీసులు చట్టబద్ధంగానే పరిష్కరించారా?సీసీటీవీ ఫుటేజీ, స్టేషన్ రికార్డులు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.మహి న్యూస్ -- ప్రజల పక్షాన.. ప్రశ్నించే గొంతుక.

సత్వర న్యాయానికి లోక్ అదాలత్..!

డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ్‌గోపాల్

సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కడప జిల్లాలో గత రికార్డును అధిగమించేలా కేసుల పరిష్కారానికి కృషి

కడప, మహి న్యూస్ ఆగస్టు 31 : ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విస్తృతంగా సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నామని డీఎల్ఎస్ఏ చైర్మన్, కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ్‌గోపాల్ తెలిపారు. సోమవారం సాయంత్రం జిల్లా కోర్టు సముదాయంలోని తన ఛాంబర్ లో గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ్‌గోపాల్ పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి తోపాటు డిఎల్ఎస్ఏ సెక్రెటరీ, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఈ నెల 19న జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో గతంలో కంటే అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించాలనే లక్ష్యంతో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించడం, చట్టాలపై న్యాయ అవగాహన కల్పించడం, సత్వర న్యాయం అందించడం న్యాయ సేవా సంస్థల ప్రధాన లక్ష్యాలని రామ్‌గోపాల్ వివరించారు. ఈ లక్ష్యాల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర, జిల్లా, తాలూకా స్థాయిల్లో న్యాయ సేవా సంస్థలు పనిచేస్తున్నాయని తెలిపారు.

ఏడీఆర్ ద్వారా సత్వర పరిష్కారం...

కోర్టుల్లో సాధారణ న్యాయ ప్రక్రియ ద్వారా కేసుల పరిష్కారానికి కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున, ప్రజలు ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీటిలో ప్రజలకు సుపరిచితమైన లోక్ అదాలత్ ముఖ్యమైనదని తెలిపారు. సివిల్ కేసులతో పాటు రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులను ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించే లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

జూలై లోక్ అదాలత్‌లో 1,05,798 కేసుల పరిష్కారం...

2026 జూలై 11న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కడప జిల్లాలో సుమారు 1,05,798 కేసులు పరిష్కారమయ్యాయని రామ్‌గోపాల్ తెలిపారు. ముఖ్యంగా చిన్నచిన్న క్రిమినల్ కేసులు, రాజీకి అవకాశం ఉన్న వివిధ క్రిమినల్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కడప జిల్లా రెండో స్థానాన్ని సాధించిందని వెల్లడించారు.ఈ విజయానికి జిల్లా యంత్రాంగం, కలెక్టర్, ఎస్పీ, న్యాయవాదులు, బార్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు అందించిన సహకారం ఎంతో కీలకమని ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గత రికార్డును అధిగమించడమే లక్ష్యం..

సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో గతంలో పరిష్కరించిన కేసుల సంఖ్యను అధిగమించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ప్రజలు తమకు సంబంధించిన రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని కోరారు.

ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి...

లోక్ అదాలత్‌లు, న్యాయ సేవలు, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని రామ్‌గోపాల్ అన్నారు. ఒక ఉపన్యాసం ద్వారా సమాచారం పరిమిత సంఖ్యలో ప్రజలకు చేరే అవకాశం ఉన్నప్పటికీ, మీడియా ద్వారా లక్షలాది మందికి సమాచారం చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు.గతంలో మీడియా అందించిన సహకారాన్ని అధిగమిస్తూ.. సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ గురించి ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను కోరారు. ప్రజలకు ఉపయోగపడే న్యాయ విజ్ఞాన సదస్సులు, లోక్ అదాలత్‌లు, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాల ద్వారా కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించడంలో మీడియా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజలకు సత్వర, సులభమైన న్యాయం అందించడమే లక్ష్యంగా సెప్టెంబర్ 12 జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ్‌గోపాల్ తెలిపారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలి

జిల్లా క్రైసిస్ కమిటీ సమావేశంలో.. జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడు

కడప, మహి న్యూస్ ఆగస్టు 31 : పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని, కార్మికుల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో .. జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు అధ్యక్షతన జిల్లా క్రైసిస్ గ్రూప్ కమిటీ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులైన అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

చిత్తూరు జిల్లా కో-ఆపరేటివ్ బంగారుపాళ్యం బ్రాంచ్ నందు శ్రావణం మాసం సందర్భంగా ప్రత్యేక డిపాజిట్ పథకం సద్వినియోగం చేసుకోండి.

మేనేజర్ రాజు శ్రీ వాత్సవ.

చిత్తూరు జిల్లా బంగారుపాలెం అగస్టు 31: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ బంగారు పాలెం బ్రాంచ్ నందు శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ రాజు శ్రీ వాత్సవ మాట్లాడుతూ,21-08-2026 వ తేదీ నుండి 30-09-2026 వ తేదీ వరకు ఈ పథకం అందుబాటులో ఉంటుందని తెలిపారు. డిపాజిట్ కాలపరిమితి 456 రోజుల సాధారణ ప్రజలకు వడ్డీ రేటు 7.60%, సీనియర్ సిటిజనులకు 8.20% వడ్డీ రేటు, సూపర్ సిటిజెన్లకు 8.30% ప్రత్యేక వడ్డీ రేటు ఉంటుందని తెలిపారు. ఈ పథకం వల్ల పొదుపు మరింత భద్రంగా, ఆకర్షణీయమైన వడ్డీ రాబడితో, మీ భవిష్యత్తుకు ఆర్థిక భరోసా ఉంటుందని కావున ఈ ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ రాజు శ్రీ వాత్సవ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజశేఖర్ బ్యాంకు సిబ్బంది మరియు ప్యాక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గణిత శాస్త్రం, కంప్యూటేషనల్ స్టడీస్‌పై అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ

రుపతి,ఆగస్టు 31,మహి న్యూస్: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం మదన మోహన మాళవీయ శిక్షక ప్రశిక్షణ కేంద్రం మరియు గణితశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన “గణిత శాస్త్రం మరియు కంప్యూటేషనల్ స్టడీస్‌లోని నూతన ధోరణులు” అనే అంశంపై ఆరు రోజుల అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుండి 46 మంది అధ్యాపకులు ఈ శిక్షణా కార్యక్రమంలో నమోదు చేసుకుని క్రియాశీలకంగా పాల్గొన్నారు.

ముగింపు వేడుకలు

ఈ కార్యక్రమ ముగింపు సమావేశంలో గుజరాత్ నుండి విచ్చేసిన ముఖ్య అతిథి ఆచార్య రాకేష్ మణిలాల్ పటేల్, విద్యా విషయక డీన్ ఆచార్య రాజనీకాంత్ శుక్లా, కేంద్ర సంచాలకులు ఆచార్య ఎస్. మురళీధర రావు, గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఏ. చందూలాల్, అదనపు సంచాలకులు డాక్టర్ ఎ. చారుకేశ్, డాక్టర్ కె. శంకర్, వివిధ విషయ నిపుణులు మరియు పాల్గొన్న అధ్యాపకులు పాల్గొన్నారు.

బోధనా వృద్ధికి ఉపయోగపడే నూతన ధోరణులు

గణిత శాస్త్రం, కంప్యూటేషనల్ రంగాలు మరియు ఆధునిక సాంకేతిక వర్గాల్లో వస్తున్న పరిశోధనా మార్పులు, అధునాతన బోధనా పద్ధతులపై ఈ శిక్షణ ద్వారా ప్రతినిధులు సంపూర్ణ అవగాహన సాధించారు. ముఖ్య వక్తలు మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానం అధ్యాపకుల బోధన, పరిశోధన మరియు వృత్తిపరమైన అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 255 అర్జీలు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి, మహి న్యూస్, ఆగస్టు 31: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను జిల్లా కలెక్టర్ సావధానంగా వింటూ అర్జీలను స్వీకరించారు. అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీల ఏర్పాటు, త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్ తదితర సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని, అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని అధికారులను ఆదేశించారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా, అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సిబ్బంది రసీదులను అందించారు.

శాఖల వారీగా అర్జీల వివరాలు:

రెవెన్యూ -- 144, పంచాయతీరాజ్ -- 36, హోం -- 10, ఎస్ఎస్ఎల్ఆర్ -- 10, పాఠశాల విద్య -- 7, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -- 6, ఫ్యామిలీ వెల్ఫేర్ -- 5, రూరల్ డెవలప్‌మెంట్ -- 4, సెర్ప్ -- 3, ఏపీఎస్‌పీడీసీఎల్ -- 3, దేవాదాయ శాఖ -- 3, కాలుష్య నియంత్రణ మండలి -- 2, గనులు మరియు భూగర్భశాస్త్రం -- 2, ఎన్‌హెచ్ -- 2, బీసీ కార్పొరేషన్ -- 2, ఎన్ఎస్ఏ -- 2, ఇంటర్మీడియట్ విద్య -- 2, ఐసీడీఎస్ -- 1, టుడా -- 1, హౌసింగ్ -- 1, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ -- 1, ఎస్సీ కార్పొరేషన్ -- 1, సెకండరీ హెల్త్ -- 1, ఇరిగేషన్ -- 1, అగ్రికల్చర్ -- 1, పీఆర్ ఇంజినీరింగ్ -- 1, హ్యాండ్‌లూమ్స్ -- 1, తెలుగు గంగ ప్రాజెక్టు -- 1, ఆర్ అండ్ బి -- 1 వెరసి మొత్తం 255 అర్జీలు రావడం జరిగిందని, సంబంధిత అధికారులు వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు.

పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను అత్యంత నాణ్యతతో, నిర్దేశిత సమయంలో పరిష్కరించాలి

చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 31: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను అత్యంత నాణ్యతతో, నిర్దేశిత సమయంలోగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలోని కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టమ్ -- పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా డీఆర్వో కె. మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, సంబంధిత ఆర్డీవోలతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 230 వినతులు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా 163 వినతులు రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించినవే కావడం గమనార్హం. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రతి వినతిని నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను ప్రాధాన్యతతో పరిశీలించి వెంటనే డిస్పోజ్ చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా వినతులపై స్పందన వేగవంతమైతేనే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత బలపడుతుందని, అధికారులు పీజీఆర్ఎస్ పోర్టల్‌ను నిరంతరం పరిశీలిస్తూ పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

శాఖల వారీగా వచ్చిన వినతులు:

రెవెన్యూ, సర్వే శాఖకు 163, పోలీస్ శాఖకు 4, పంచాయతీ రాజ్ శాఖ 3, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ 2, డీఆర్‌డీఏకు 21, ఇరిగేషన్ శాఖ 7, రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్ 5, రూరల్ డెవలప్మెంట్ 2, దేవదాయ శాఖ 1, పరిశ్రమల శాఖ 2, పౌరసరఫరాల శాఖ 2, పశుసంవర్ధక శాఖ 2, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ 2, జిల్లా గ్రంథాలయం 1, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 2, వాటర్ రిసోర్సెస్ 3, గృహ నిర్మాణ సంస్థ 1, విద్యుత్ శాఖ 2, ఎల్ డి ఎం 2, డిసిసి బ్యాంక్ 1, ఐసిడిఎస్ 1, బీసీ కార్పొరేషన్ 1 సొప్పున మొత్తం 230 వినతులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను వినతల రూపంలో అందజేశారు ఈ కార్యక్రమంలో నగిరి ఆర్డీవో అనుపమ,డీపీఎం, మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్ వెంకట సునీల్, జిల్లాలోని వివిధ శాఖల ఉన్నత శాఖల తదితరులు అధికారులు పాల్గొన్నారు.

యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడాలి

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి చిత్తూరు జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చాలి

చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 31: దేశ భవిష్యత్తుకు అవసరమైన యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం మాదకద్రవ్యాలు మరియు గంజాయి నియంత్రణ చర్యలు -- అవగాహన కార్యక్రమాలు ఎన్సిఓర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్, చీజూ=ణ) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి ఆర్డీఓలు, పోలీను అధికారులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఈగల్ టీమ్ తదితర అధికారులతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని శాఖలు మరింత సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా జిల్లాల మధ్య రవాణాకు రైల్వే, ఆర్టీసీ ప్రధాన మార్గాలుగా ఉన్నందున, ఈ మార్గాల్లో తనిఖీలు, నిఘాను మరింత పటిష్టం చేయాలని తెలిపారు. ఆర్టీసీ అధికారులు తమ పరిధిలో డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు, రాండమ్ చెకింగ్ విధానం, డ్రైవర్లు, కండక్టర్లకు ఇస్తున్న శిక్షణ, పోలీసుల సహకారంతో నిర్వహిస్తున్న తనిఖీలు తదితర అంశాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి అన్ని డిపో మేనేజర్లు, డీఎం, ఆర్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి నుంచి లిఖితపూర్వక నివేదికలు తీసుకోవాలని ఈగల్ టీమ్‌ను ఆదేశించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై ముందస్తు నిఘా పెంచాలని, అవసరమైన సందర్భాల్లో సంబంధిత వ్యక్తులకు అవగాహన కల్పించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఎక్సైజ్ శాఖ, ఆర్డీఓలు, డీఎస్పీలు, పోలీసు శాఖ, ఈగల్ సెల్ అధికారులు తమ పరిధిలో చేపడుతున్న చర్యలపై లిఖితపూర్వక నివేదికలు సమర్పించాలని తెలిపారు. యువతను మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులు కాకుండా చేయడానికి పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, మెడికల్ కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఆర్డీఓలు, డీఎస్పీల అధ్వర్యంలో క్లస్టర్ స్థాయిలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని, డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన నష్టాలను విద్యార్థులకు వివరించాలని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వామ్యం చేసి, ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు. జిల్లాలో డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చర్యలను నిరంతరం కొనసాగించాలని స్పష్టం చేశారు. డ్రగ్స్ లేదా గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే పోలీసు శాఖకు లేదా ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972, 9490617896కు సమాచారం అందించాలని, సమాచారమిచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ మారూరి పుల్లారెడ్డికి డా. రామకృష్ణ స్మారక జీవన సాఫల్య పురస్కారం ప్రదానం

పల్నాడు జిల్లా/సత్తెనపల్లి /మహి న్యూస్ అగస్టు 31: కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ ఒంగోలు వారి అధ్వర్యంలో శనివారం ఒంగోలులోని సివియన్ రీడింగ్ రూం అవరణలో గిడుగు రామమూర్తి పంతులు163 వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా చందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారులచే 'తెలుగు పాటల పూదోట ఈపూట' పేరిట అచ్చంగా తెలుగు భాషకు సంబంధించిన పాటలతో నృత్య నీరాజనం కార్యక్రమం అద్భుతంగా జరిగింది. అనంతరం ప్రముఖ సాహితీవేత్త, వ్యాఖ్యాత, ప్రభుత్వ పాఠ్య పుస్తకాల రచయిత 'కీ.శే డా. వంకాయలపాటి రామకృష్ణ (సత్తెనపల్లి) స్మారక జీవన సాఫల్య పురస్కార అవార్డును సత్తెనపల్లికి చెందిన సీనియర్ పాత్రికేయులు, గుంటూరు జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ మాజీ అధ్యక్షులు మారూరి పుల్లారెడ్డికి స్వర్గీయ రామకృష్ణ భార్య శ్రీమతి వంకాయలపాటి జయలక్ష్మి అందజేశారు. ఈసందర్భంగా చందు డాన్స్ అకాడమీ చిన్నారులు అవార్డు గ్రహీతకు నృత్యాభినయంతో పూలు చల్లుతూ సాంప్రదాయ పద్ధతి ప్రకారం సత్కరించారు. సంస్థ సభ్యులు సన్మాన పత్రం సమర్పించారు. పురస్కార గ్రహీత పుల్లారెడ్డి మాట్లాడుతూ కీర్తిశేషులు డా. వంకాయలపాటి రామకృష్ణ తో తనకున్న సాన్నిహిత్యాన్ని, ఆయన విశిష్టతను గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు డా. నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ మన మాతృ భాషను పరిరక్షించుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు సహరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు శ్రీమతి తేళ్ళ అరుణ మాట్లాడుతూ వాడుక భాషోద్యమానికి సారధ్యం వహించి,వాడుక భాషలోనే ప్రజల వ్యవహారాలన్నీ జరగాలని,దాన్ని లక్ష్యంగా చేసుకుని, దానికోసం గ్రాంథిక భాషావాదులతో తగవులు పడి చివరకు విజయాన్ని సాధించిన వైతాళికుడు గిడుగు అని అన్నారు.

విశ్రాంత అడిషనల్ ఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధి కోసం అందరూ కలిసి కట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నేటి యువతరం అందుకు ముందుకు వచ్చేలా విద్యార్థులకు పద్య పఠన పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని సూచించారు. తదుపరి విశిష్ట అతిథిగా పాల్గొన్న శ్రీ కృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, ప్రముఖ కవి యు.వి.రత్నం, పరాంకుశం కృష్ణవేణి, మిడసల మల్లికార్జునరావు, గుంటూరు సత్యనారాయణ, కేయస్వీ ప్రసాద్, ఓరుగంటి ప్రసాద్, కోవెలకుంట్ల బాలకోటయ్య తదితరులు పాల్గొని తెలుగు భాష తియ్యదనాన్ని గురించి డా. రామకృష్ణ గొప్పతనాన్ని గురించి ప్రసంగించారు. ముందుగా గిడుగు రామమూర్తి, తెలుగుతల్లి చిత్ర పటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ గుండవరపు అమర్ నాథ్, ప్రజాశక్తి విలేకరి రాము, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీకి అభివృద్ధి కోసం చేయూతను అందించండి

నంద్యాల, మహి న్యూస్, ఆగస్టు 31: జిల్లాలో రక్తనిల్వలను పూర్తి స్థాయిలో ఉంచాలనే సంకల్పంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని ఏర్పాటు చేయడం జరిగిందని అందుకు సంబంధించి ఉద్యోగులందరూ సభ్యులుగా నమోదు అవ్వాల్సిన అవసరం ఎంతగానో ఉంటుందని జిల్లా కలెక్టర్ జి. రాజ కుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓ సుబ్బారెడ్డి, డిఆర్ఓ రామునాయక్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.....జిల్లాలో రక్తనిల్వల కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ బలోపేతం కోసం జిల్లా పరిషత్ సిబ్బంది 30 మంది జీవితకాల సభ్యత్వం తీసుకోగా రూ.33 వేలు ఇవ్వడం జరిగిందని, గతంలో కూడా ఎంపిడిఓలు, సూపరింటెండెంట్లు, జిల్లా పరిషత్ సిబ్బంది నుండి మొత్తం 56 మంది జీవితకాల సభ్యత్వం తీసుకోవడం ద్వారా రూ.61,600/- సమకూరడం జరిగిందన్నారు. రెడ్ క్రాస్ సొసైటీని బలోపేతం చేయడానికి ఉద్యోగులందరూ కేవలం వెయ్యి రూపాయలు చెల్లించి జీవితకాల సభ్యతం తీసుకోవచ్చు అన్నారు. అదే విధంగా వైస్ పాట్రన్ కోసం రూ.12,500/-, పాట్రన్ కోసం రూ.2,5000/- చెల్లించాల్సి ఉంటుందని, గుర్తింపు కార్డు కోసం అదనంగా వంద రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సభ్యత్వం ఉన్న వారికి అతి తక్కువ రుసుముతో రక్తం అందించడం జరుగుతోందన్నారు. అదే విధంగా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అవసరం ఉన్న సేవలు అందించడంతో పాటు అత్యవసర సమయంలో సిపిఆర్ చేయడం, బ్రహ్మోత్సవాల సమయంలో విధులు నిర్వహించడం జరుగుతోందన్నారు. అంతేకాకుండా జిల్లాలో అందించిన ఉత్తమ వైద్య సేవలకు గాను రాష్ట్ర గవర్నర్ గారు మెరుగైన ఆరోగ్యం అందించాలని సంకల్పంతో "మీ ఇంటికి - మీ డాక్టరు" క్రింద రూ.2 కోట్లతో అంబులెన్స్ హాస్పిటల్ ను పంపడం జరిగిందన్నారు. ఇందుకు అవసరమైన సిబ్బందిని కూడా నియమించుకోవడం జరిగిందన్నారు. ఈ సర్వీసు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూడా అవసరమైన పూర్తి స్థాయి ఆరోగ్య సేవలు అందించడం జరుగుతోందన్నారు. అదే విధంగా డిఆర్ఓ, ఆర్డీఓలు, తహశీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి సభ్యత్వం పెంచేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ కి జాయింట్ కలెక్టర్ గారు చైర్మన్‌గా ఉన్న నేపథ్యంలో యువ రక్తదాతలను పెంచేలా డిఈఓ, డివిఈఓ కృషి చేయాలన్నారు.

రైతుల గోడు వినేదిఎవరు

రైతులకు అందుబాటులో లేని ఓర్వకల్లు మండల వ్యవసాయ అధికారి

కార్యాలయానికి వచ్చిన రైతులకు నిరాశే.. సమయం 11 దాటినా అధికారి రాకపై ఆగ్రహం

రాకపోకల ఖర్చులే భారమవుతున్నాయని రైతుల ఆవేదన.. ఉన్నతాధికారులు స్పందించాలని విజ్ఞప్తి



ఓర్వకల్ ఆగస్టు 31 (మహి న్యూస్) : కర్నూలు జిల్లా,ఓర్వకల్లు రైతులకు అందుబాటులో ఉండాల్సిన మండల వ్యవసాయ కార్యాలయంలో అధికారి అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండల వ్యవసాయ అధికారిణి మధుమతి కార్యాలయ విధుల సమయంలో అందుబాటులో ఉండటం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయం 11 గంటల సమయం దాటినా వ్యవసాయ అధికారి కార్యాలయానికి రాకపోవడంతో వివిధ అవసరాల కోసం వచ్చిన రైతులు నిరాశతో వెనుదిరిగినట్లు వారు తెలిపారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన సమస్యలు, పథకాలు, విత్తనాలు, ఇతర అవసరాల కోసం కార్యాలయానికి వస్తే అధికారి అందుబాటులో లేకపోవడంతో తమ సమయం వృథా అవుతోందని రైతులు వాపోయారు.

ప్రతిరోజూ ఇదే పరిస్థితి"

కార్యాలయానికి వచ్చి అధికారి కోసం ఎదురుచూసి తిరిగి వెళ్లాల్సి వస్తోందని రైతులు ఆరోపించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు ప్రయాణ చార్జీలే అదనపు భారంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు సేవలందించాల్సిన అధికారులు విధి సమయంలో కార్యాలయంలో అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP 517503.A.P .
VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com